క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

పీలేరు : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని సర్పంచ్ జీనత్ షఫీ, డాక్టర చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. శుక్రవారం పీలేరు గ్రామ సచివాలయం-1లో జగనన్న ఆరోగ్య సురక్ష 2 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించి 402 మందికి వైద్య సేవలు అందించడం తోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కరిని మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ అరుణ్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

పెద్దమండ్యం : కంటి జబ్బులతో బాధపడుతున్నవారికి శుక్రవారం మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీ ఆధ్వర్యంలో గత నెల 29 న మౌలాకా పహాడ్ వద్ద ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. ఆసుపత్రి నుండి కంటి అద్దాలు తీసుకొచ్చిన నిర్వాహకులు వారికి అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ సభ్యులు అమీర్‌బాషా, బాకీ ఉల్లాఖాన్, గౌస్‌సాహెబ్, అమీన్‌పీర్, ముషీర్ పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం : ఎండాకాలం దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను అప్రమత్తంగా చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో కాన్పులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి సుఖప్రసవం అయ్యే విధంగా చూడాలన్నారు. వైద్యులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాల్లన్నారు. డాక్టర్ సనా అయేషా, సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది కష్టపడి పని చేయాలన్నారు. శుక్రవారం డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ కెఎంపిఎల్, ఈపీకె, ఓఆర్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం నిలిపినట్లు పేర్కొన్నారు. ఉత్తమ మెకానిక్‌గా అష్రఫ్, ఉత్తమ స్టోర్స్ సూపర్‌వైజర్‌గా ఎస్ఎస్ బాషా, ఉత్తమ ట్రాఫిక్ సూపర్‌వైజర్‌గా గంగన్న, ఫిబ్రవరి నెలలో టార్గెట్ ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు ఎస్ఎస్ వాసులు, ఆంజనేయులు, కుమార్ ,కృష్ణ, పివిబి రెడ్డి,అమరమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎం.ఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

వాల్మీకిపురం: స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్ఎం రమణప్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 15వ తేదిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ప్రతి వినియోగదారుడు తన హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం వినియోగదారుల అవగాహన పోస్టర్లను ఉపాధ్యాయులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవీంద్ర రెడ్డి, నాగరాజ, ఉషారాణి, కల్పలత, పురుషోత్తం, శంకర, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల పూజ

వాల్మీకిపురం: పట్టణ శివారు ప్రాంతంలోని శతశృంగ పర్వతశ్రేణుల్లో కొలువైన శ్రీ అక్కదేవతల ఆలయంలో శుక్రవారం అక్కదేవతల పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం పూజారి వెంకటరాజు ఆధ్వర్యంలో గుర్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అలాగే చాందినీ బండ్లను ఏర్పాటు చేసి గొందిగుంట గుడి వరకు మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం గుడి వద్ద అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు


అన్వర్ బాషా

ములకలచెరువు : మండలంలోని నాయనివారిపల్లికి చెందిన అన్వర్‌బాషా అనే యువకుడు లాక్రోస్ మెన్ చాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌డీ ప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన ఏపీ తొలి లాక్రోస్‌మెన్ చాంపియన్ షిప్ క్రీడా పోటీలకు వివిధ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా అన్నమయ్య జిల్లా జట్టు విజయకేతనం ఎగుర వేసిందన్నారు. ఈ పోటీల్లో చక్కటి ప్రతిభ చూపిన అన్వర్ బాషా ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టులో పాల్గొంటాడని ఆర్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు.

భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

- వందేళ్ల తర్వాత రాష్ట్రంలో రీసర్వే చేపట్టిన వైఎస్సార్ సీపీ
- జగనన్న శాశ్వత భూహక్కుతో రైతు సమస్యలు దూరం


రైతులకు యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తదితరులు.

మదనపల్లె : భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టనంత పెద్దస్థాయిలో భూముల రీసర్వే చేపట్టి, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు న్యాయం చేశారని సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రైతులకు యాజమాన్య ఆస్తి ధృవపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ శరత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిసార్‌అహ్మద్, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, వెలుగుచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...భూముల రీసర్వే ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన కార్యక్రమమని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ఎవరూ టాంపర్ చేయలేని విధంగా భూయజమానులకు భూహక్కు పత్రాలను అందించడం దేశచరిత్రలోనే ప్రప్రథమన్నారు. బ్రిటీష్ కాలంలో నిర్వహించిన సర్వే తర్వాత పెద్దస్థాయిలో దాదాపు వందేళ్ల తర్వాత సమగ్ర సర్వే నిర్వహించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. సమగ్ర సర్వే కారణంగా భూవివాదాలు పరిష్కారమవడమే కాకుండా, దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. రైతులకు ఉపయోగపడేవిధంగా ఇలాంటి పనులు ఎందుకు చేయలేదన్నారు. 2014 ఎన్నికలకు ముందు 614 హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రెండుపేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలను 100శాతం నిలుపుకున్నారన్నారు. నేడు రాష్ట్రంలో ప్రతి గడపకు ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు మేలు జరిగి ఉంటేనే తనకు ఓటువేయండని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారంటే...ఆయన మాటల్లోని నిజాయితీని, ధైర్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి కలకాలం అందాలంటే... జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనను గెలిపించి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు


మిట్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కురబలకోట : ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు వెల్లడించారు. శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను ఆయన పరిశీలించారు. అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంలో భాగంగా ముందస్తుగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లను భద్రపరచడానికి ఇక్కడ మూడు రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో పూర్తి భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు, భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలో అన్ని పోలింగ్ స్టేషన్లకు ఇక్కడి నుండే ఈవీఎంలను పంపడం జరుగుతుందని తహసీల్దారు ఈశ్వరమ్మ తెలిపారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ముదివేడు ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి, ఏఎస్ఐ గజేంద్ర, ఆర్ఐ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, మండల, స్థానిక గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధుల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహమూద్ ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళపై హత్యాయత్నం

కురబలకోట : పాత కక్షల కారణంగా ఒంటరిగా ఉన్న మహిళపై శుక్రవారం కురబలకోట మండలంలో హత్యాయత్నం జరిగింది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..మండలంలోని లెట్టుకు చెందిన మూడే ఈశ్వరమ్మ (22) రోజూ తండ్రికి సాయంగా గొర్రెలను తోలుకుని ఊరి బయట అప్పగించి ఇంటికి వచ్చేది. శుక్రవారం వెనుదిరిగి వస్తుండగా ప్రత్యర్థులు భారతి, జ్యోతి దారి కాచి ఈశ్వరమ్మపై కొడవలితో దాడి చేశారు. ఆమె కేకలు వేయడంతో సమీప ప్రాంతంలోని వారు అక్కడికి చేరుకోవడంతో దాడి చేసిన వారు పరారయ్యారు. గతంలో ఈశ్వరమ్మకు చెందిన గొర్రెలను భారతి పెంపుడు కుక్కలు కర వడంతో చనిపోయాయి. అప్పట్లో ఈమె పోలీసులను ఆశ్రయించి ఈమె నుండి నష్టపరిహారం పొందింది. దీన్ని మనసులో పెట్టుకుని ప్రత్యర్థులు ఈ సంఘటనకు పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

విద్యాసామగ్రి అందజేత

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యులు డాక్టర్ పురుషోత్తంనాయుడు పరీక్ష సామగ్రిని అందజేశారు. శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన అట్టలు, పెన్నులు, పెన్సిల్, పాలిథిన్ కవర్స్ పంపిణీ చేశారు. వందశాతం ఉత్తీర్ణ తసాధించడానికి ప్రత్యేక శిక్షణ తో పాటు, తల్లిదండ్రుల పాత్రను తెలియజేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాల అంకురార్పణ


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహోత్సవాల అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఆలయంలో వేకువజామునే మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో కలశస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వస్తివాచనం, పుణ్యావాచానం కావించారు. అనంతరం రక్షాబంధనం, మృత్యంగ్రహణం, అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

బహుజన బాంధవుడు కాన్షీరామ్


కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీకే, బాస్ నాయకులు

మదనపల్లె : బహుజనులను రాజ్యాధికారానికి దగ్గర చేసిన సిద్ధాంతకర్త, బహుజన బాంధవుడు కాన్షీరామ్ అని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ అన్నారు. శుక్రవారం కాన్షీరామ్ జయంతి సందర్భంగా స్థానిక బాస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక ఓటు- ఒక నోటు నినాదంతో ప్రజల దగ్గరికి వెళ్లి వారిచ్చే డబ్బుతోనే కులాన్ని నిర్మూలిద్దాం - బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ కాన్షీరామ్ ప్రచారం చేశారన్నారు. 85 శాతం ఉన్న బహుజనులు 15 శాతం ఉన్న అగ్రకులస్తులపై ఎందుకు ఆధారపడాలని, అందరం ఐక్యంగా పోరాడి బహుజన రాజ్యాధికారాన్ని సాధించుకుందాం అని చెప్పి మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్, నారాయణ గురు, అంబేద్కర్ వంటి మేధావుల ఆలోచనలను, ఆశయాలను ఆచరణలో పెట్టిన వాస్తవికవాది కాన్సిరామ్ అన్నారు. వీసీకే పార్టీ మరియు భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు రవిశంకర్,సానికంటి రెడ్డప్ప, గంగాధర్, సూరి, రెడ్డి ప్రసాద్, శ్రీకాంత్, హైదరవల్లి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

తంబళ్లపల్లె : రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ శివకుమార్ సూచించారు. శుక్రవారం మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు సీఐ మధుల ఆదేశాల మేరకు తంబళ్లపల్లె, ఉప్పులూరువాండ్లపల్లె, కొటాల కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీసులంటే ప్రజలకు నమ్మకం, భరోసా కలిగించేందుకే కవాతు నిర్వహించామన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

కలికిరి : ఎన్నికల విధులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల సమోదు అధికారి ఎస్.రమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గంలోని ఎన్నికల విధులలో పాల్గొను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటటిక్ సర్వెలెన్స్ టీం, వీడియో వీయింట్ టీం, ఎంసీసీ టీం సభ్యులకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీఓలు, తహశీల్దార్లు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

పీలేరురూరల్ : ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవోలు వై. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అయ్యప్పరెడ్డి కాలనీలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ మెయిన్ స్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కోటపల్లె జెడ్పీ బాలుర, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్‌వీఎస్ఎన్. కాకతీయ, తలపు, రేగళ్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలు పరీక్ష కేంద్రాలుగా ఉన్నట్లు తెలిపారు. మొత్తం 9 పరీక్షా కేంద్రాలలో 1750 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కేంద్రాలకు వంద మీటర్ల వరకు జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలన్నారు. విద్యార్థులు గంటకు ముందు పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ చీఫ్ కె. పార్వతమ్మ, హెచ్ఎం ఫౌజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కలకడ : సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన పాలన అందుతోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ దిగువపాళ్యంలో ప్రభుత్వం నూతనంగా రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 21.80లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ కుటుంబానికి ప్రభుత్వం చేసిన మంచి, అభివృద్ధిని చూసి మరోమారు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పీవీ మిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించడానికి అందరి సహకారం అవసరమని అభ్యర్థించారు. ఎన్ని సర్వేలు చేసినా విజయం వైఎస్సార్ సీపీ వైపే ఉందన్నారు. దిగువ పాళ్యంలో నూతన సచివాలయం, వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల నిర్మాణం కోసం గ్రామానికి చెందిన కుమార్‌నాయుడు, యుగంధర్‌నాయుడు, హరిప్రసాద్ నాయుడులు వారి తల్లి దండ్రులు రామాంజులునాయుడు-యశోదమ్మల జ్ఞాపకార్థం స్థలం వితరణ చేసి అభివృద్ధిలో పాలుపంచుకున్నారన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, సింగల్ విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, కమలాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, వారినాథరెడ్డి, ఖరీముల్లా, నరసింహారెడ్డి, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

– డిస్కం చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య

రామసముద్రం : రైతులకు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తామని తిరుపతి డిస్కం చిఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య తెలిపారు. శుక్రవారం ఆయన రామసముద్రం సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. వ్యవసాయపు ఫీడర్ లోడ్స్ ఎంత వస్తున్నది అనేదాని గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఎన్నికల కోడ్ వచ్చే నేపథ్యంలో రైతులకు వ్యవసాయ విద్యుత్ కు కొత్త కనెక్షన్ మంజూరు చేస్తారా లేదా అని రైతులను అడిగారు. దీనిపై స్పందించిన సిజీఎం ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న రైతులకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రైతులకు తమ సిబ్బంది నుంచి ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానాల్లో వెంటనే మార్పు చేసి కొత్తవి ఇవ్వాలన్నారు. అనంతరం సిజీఎంను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యుగంధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీవన్‌రెడ్డి, ప్రొటెక్షన్ ఏఈలు అజయ్ బాబు, మస్తాన్, పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులకు అవగాహన

నిమ్మనపల్లె : బూత్‌స్థాయి అధికారులకు ఈవీఎంల వినియోగం, పనితీరుపై ఎంఈఓ నారాయణ అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సెక్టార్ అధికారి, ఎంఈఓ-2 నారాయణ సెక్టార్-32 కు సంబంధించిన బూత్ స్థాయి అధికారులకు ఈవీఎంల వినియోగం, వాటి పనితీరుపై వివరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో బూత్ స్థాయి అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ పటిష్టంగా చేయాలన్నారు . ఈవీఎంల వినియోగంపై మాక్ డ్రిల్ ను నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తారని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 11 మందికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.12,00,000లు ఎమ్మెల్యే చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించారన్నారు. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సాయిక్రిష్ణారెడ్డి

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు చరిత్ర సృష్టిస్తున్నాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తిలో ఇంటింటికి పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ నుంచి రెడ్డి ప్రసాద్, మస్తాన్, రాము, సయ్యద్‌సాబ్ వలి, నందు, తదితరులు చింతల సాయిక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందిరమ్మ కాలనీ, చింతపర్తిలో చింతల అభిమాన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో చింతల సాయిక్రిష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు నిరుపేదలకు, వృద్ధులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. సేవా కార్యక్రమాల నిర్వహణతోనే మన నాయకులపై అభిమానం చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, కిరణ్ కుమార్, నరసింహులు, ప్రియరంజన్‌రెడ్డి, చెంగల్ రెడ్డి, హర్షవర్ధన్, విక్రం రెడ్డి, ముబారక్, మణి, సుధాకర్, రెడ్డి సుబ్రహ్మణ్యం, నాగేంద్ర, చింతల శివానంద రెడ్డి, సత్తి రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


ఆర్‌వో ప్లాంటును ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సుగాలితాండా పంచాయతీలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి 58 నెలలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రతి కుటుంబానికి ఏదోవిధంగా ఆర్థిక లబ్ధి చేకూరిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి తమకు మంచి జరిగిందని భావిస్తేనే ఓట్లు వేయాలని కోరారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఆర్‌వోప్లాంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ కృష్ణవేణి, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గణపతిరెడ్డి, నాగసిద్ధారెడ్డి, సిరినాయుడు, సుబ్బయ్యనాయుడు, మల్లికార్జున, సుబ్బయ్యానాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అనైతిక పొత్తు పార్టీలను భూస్థాపితం చేద్దాం


ప్రచారం చేస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనలేక అనైతిక పొత్తు పెట్టుకున్న పార్టీలను భూస్థాపితం చేద్దామని పంచాయతీరాజ్ జిల్లా అభివృద్ధి సలహామండలి సభ్యుడు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కామాటంపల్లె, అయ్యప్పరెడ్డి కాలనీ, ఇందిరానగర్, బిలాల్‌మసీదు, బోడేషావలి దర్గా, ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ముస్లిం మైనారిటీలకు, వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు చేరువైన జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత, పిక్కా రమణ, పరమేష్, అబీద్, మునీర్, మసూద్, జిలానీ, ముస్తాఖ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మేనిఫెస్టో కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ సంస్థ సభ్యులు

గుర్రంకొండ : మండలంలోని కండ్రిగ గ్రామ మసీదులో ప్రజామేనిఫెస్టో కరపత్రాలను జిల్లా జమాతే ఇస్లామీ హింద్ సంస్థ సభ్యులు ఆవిష్కరించారు. శుక్రవారం జమాతే ఇస్లామీ హింద్ సంస్థ జిల్లా అధ్యక్షులు ఆజాం అలీఖాన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు ప్రజామేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించి, పలువురికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 498ఏలో పిల్లల సెక్షన్‌ను నిర్వీర్యం కాకుండా నిరోధించాలన్నారు. ప్రజలకు సురక్షితమైన ప్రశాంతమైన జీవితం కల్పించాలన్నారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కులవివక్షను నిర్మూలించాలన్నారు. 1991 ప్రార్థనా స్థలాల చట్టాన్ని బలపరచాలన్నారు. ఈచట్టం ప్రకారం 1947 ఆగష్టు15 నాటికి ఉన్న ప్రార్థనా స్థలాలపై యథాస్థితిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌనఖ్‌భాషా, సంస్థ సభ్యులు బాబు, ఆస్లాం, షంషీర్‌లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

కలకడ : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కలకడ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ బొంతలవారిపల్లెలో గ్రామస్తులకు, మహిళలకు మొబైల్ వినియోగంపై అవగాహన కల్పించారు. యువత మొబైల్ లోన్, ఇన్‌స్టాగాం, షాపింగ్ వంటి మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సొంత గ్రామస్తులు, బంధువులు నమ్మి ఇవ్వని అప్పులు ఎలాంటి హామీ, నమ్మకం లేకుండా ఇతరులు ఎందుకు ఇస్తారన్నారు. ఉద్యోగాలు, ఉపాధి అంటూ ఎవరైనా హామీ ఇస్తే మోసపోకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.